క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయొద్దు



పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్: బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయొద్దని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ప్రజలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లను, పబ్లిక్ టాయిలెట్లను ఆయన పరిశీలించారు. పట్టణాన్ని ఓడీఎఫ్ ప్లస్ రహిత పట్టణంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేసేవారికి జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రావణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్నకాలనీ పూసాల రోడ్డు బస్టాండ్, పోలీస్‌స్టేషన్ ఏరియాలో బుధవారం విద్యుత్ అంతరాయంలో అంతరాయం కలుగుతుందని ఎన్‌పీడీసీఎల్ ఏఈఈ రంగు శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పూసాల రోడ్డులో రోడ్డు వెడల్పు కారణంగా ట్రాన్స్‌ఫాం ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



గోదావరిఖనిటౌన్: పట్టణంలోని శ్రీచైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల సీనియర్ అధ్యాపకుడు తోట యాకాంతం రసాయన శాస్త్రంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డిజైన్, సింథసిస్, యాంటీ క్యాన్సర్ ఎవల్యూషన్ ఆఫ్ 134–ఆక్సాడయాజోల్, 123–ట్రయాజోల్, ఐసోగ్జోల్, డెరివటీస్‌పై ప్రొఫెసర్ ఆర్.రమేశ్‌రాజు పర్యవేక్షణలో జరిగిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు.

ప్రత్యేక పూజలు



దీపదానం స్వీకరిస్తున్న పూజారి రమేశ్

సుల్తానాబాద్: పట్టణంలోని సాంబశివాలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని పూజారి రమేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కార్తీకమాసం ప్రారంభం కావడంతో భక్తుల నుంచి పూజారులు దీపదానం స్వీకరించారు. శివాలయంలో రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

‘పట్టణ ప్రగతి’పై చిన్నచూపు

- ప్రధాన సమస్యగా డ్రైనేజీ వ్యవస్థ
- శిథిలావస్థకు చేరడంతో ఎక్కడికక్కడే నిలుస్తున్న మురుగు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు
- టెండర్లు పూర్తయినా నిర్మాణానికి నోచుకోని వైనం



శిథిలావస్థలోని డ్రైనేజీలో భగీరథ పైపులు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ

రామగుండం: పాలకులు మారుతున్నా.. పట్టణ ప్రగతి కానరావడం లేదంటూ రామగుండం ప్రజలు నిత్యం ఆరోపిస్తున్నారు. రామగుండం నోటిఫైడ్ ఏరియా నుంచి కార్పొరేషన్ స్థాయికి చేరినా డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన బల్దియా అధికారులు ఇంటి పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపిస్తున్నారే తప్ప.. పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లు పూర్తయినా కార్యరూపం దాల్చలేదు..

30ఏళ్ల క్రితం నోటిఫైడ్ ఏరియాగా ఉన్నప్పటి డ్రైనేజీ వ్యవస్థతోనే ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన డ్రైనేజీకి ఇరువైపులా నిర్మించిన బండరాళ్లు కూలిపోయి మురుగు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఎక్కడికక్కడే మురుగు నిలిచి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ కాలనీల నుంచి వచ్చే మురుగు నేరుగా ప్రధాన డ్రైనేజీలోకి చేరుతుండడంతో ఐదుడుగుల లోతు ఉన్న డ్రైనేజీ మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ప్రమాదకర స్థితిలోకి చేరింది. ఇక వర్షాకాలమైతే మురుగు మొత్తం ప్రధాన రహదారిపై నుంచి పారుతుంది. స్థానికంగా ఉన్న పాలకుల మధ్య అంతర్గత ఆధిపత్యంతో పలుమార్లు భూగర్భ, ఓపెన్ డ్రైనేజీ నిర్మాణాల పేరిట టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ నిర్మాణానికి కార్యరూపం దాల్చలేదు. రామగుండంలో ప్రస్తుతం డ్రైనేజీ సమస్య ప్రజలకు ఇబ్బందిగా మారింది.

భూగర్భ డ్రైనేజీతో పరిష్కారం



అయోధ్యనగర్‌లో ఇప్పటికే పలు డ్రైనేజీ నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ ప్రధాన రహదారి పక్కన నిర్మించే ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి చేపడుతున్న కార్యాచరణను ముమ్మరం చేయాలి. ఎన్నికల తర్వాత కార్పొరేషన్ నిధులతో సత్వరమే భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి. అప్పుడే శాశ్వతంగా సమస్య తొలుగుతుంది. – ఇసంపెల్లి తిరుపతి, అయోధ్యనగర్ కాలనీవాసి

ప్రతిపాదనలు వచ్చాయి



పట్టణ ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి కార్పొరేషన్ నిధులతో భూగర్భ లేదా ఓపెన్ డ్రైనేజీ నిర్మించడానికి ప్రతీ పాలకవర్గం సమయంలో ప్రతిపాదనలు రావడం, నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య లేకపోవడంతో నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఎన్నికల తర్వాత మున్సిపల్ నిధులతో సత్వరమే డ్రైనేజీ నిర్మాణం చేపడితేనే సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చు. – మాడిశెట్టి రవీందర్, పోచమ్మ టెంపుల్ వీధి

దుర్వాసనతో ఇబ్బంది



డ్రైనేజీలో 365 రోజులు మురుగు నిండిపోయి ఉంటుంది. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మురుగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో దుర్వాసనతో ఇబ్బందిగా ఉంటుంది. అందులో నుంచే మిషన్ భగీరథ పైపులైన్ ఉండడంతో పైపుకు సూక్ష్మంగా రంధ్రం పడితే పట్టణ ప్రజలందరికీ భగీరథ నీరు కలుషితమై వస్తుంది. దీనిపై పాలకులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి. – దొంతుల మాధవి, టెంపుల్‌రోడ్, వ్యాపారి

ఓటుహక్కు ప్రాముఖ్యతపై ప్రచారం



అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌ఐ రాజేందర్‌రెడ్డి

కోల్‌సిటీ: ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కుపై మంగళవారం ఎన్నికల అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గోదావరిఖనిలోని సీతానగర్, రాంనగర్, వినోదనగర్, మార్కెట్ ఏరియా, హనుమాన్‌నగర్, శివాజీనగర్, చౌరస్తా ఏరియా, విఠల్‌నగర్, ఫైవింక్లయిన్ చౌరస్తా తదితర కూడళ్లలో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాజాత బృందంతో సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా భారత రాజ్యాంగంలో ఓటుకు ఉన్న ప్రాధాన్యత, ప్రజాస్వామ్యం బద్ధంగా ఓటుహక్కు వినియోగంతో ప్రజాప్రతినిధుల ఎన్నిక తదితర అంశాలపై ప్రదర్శనల రూపంలో అవగాహన కల్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) అరుణశ్రీ, ఐఏఎస్, స్వీప్ నోడల్ అధికారి గండ్ల స్వరూపరాణి, మెప్మా సీఓలు, జూనియర్ అసిస్టెంట్లు, ట్రాన్స్‌జెండర్స్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, మహిళలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో మంగళవారం బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓ)లతో రెవెన్యూ పరిశీలకులు రాజేందర్‌రెడ్డి ఓటరు జాబితా ప్రదర్శించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పెండ్యాల విమల, ఎలుక సరితారాణి, పెసరి జ్యోతి ఉన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



జ్యోతినగర్: బాలల దినోత్సవంలో విద్యార్థులు



సుల్తానాబాద్: అల్ఫోర్స్ పాఠశాలలో..



రామగుండం: ఉపాధ్యాయులతో విద్యార్థులు



మంథని: ఉపాధ్యాయులుగా చిన్నారులు

జ్యోతినగర్/యైటింక్లయిన్‌కాలనీ/రామగుండం/పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/పాలకుర్తి/కమాన్‌పూర్/మంథని/గోదావరిఖనిటౌన్/రామగిరి: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణల్లో అలరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పాఠాలు బోధించారు.

వినియోగంలోకి తెచ్చారు

సాక్షి స్పందన

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న శాస్త్రినగర్ సులభ్ కాంప్లెక్స్ గురించి ‘ఉన్నా నిరుపయోగమే’ అని ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కథనానికి స్పందించి చుట్టుపక్కలా ఉన్న చెట్లను తొలగించారు. వాహనదారులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా వినియోగంలోకి తీసుకొచ్చారు. వాహనదారులు, స్థానిక ప్రజలు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.



సులభ్ కాంప్లెక్స్‌ను శుభ్రం చేసిన సిబ్బంది

‘నా ఫొటోలు మార్ఫింగ్ చేశారు’

కాల్వశ్రీరాంపూర్: అత్యంత ఖరీదైన కారు ఉన్నట్లు, విదేశీ అకౌంట్లలో కోట్లాది రూపాయిలు జమచేసినట్లు ప్రత్యర్థులు తనపై తప్పుడు ఆరోపణలు చేశారని తన ఫొటో మార్ఫింగ్ చేశారని కాంగ్రెస్ పెద్దపల్లి అసెంబ్లీ అభ్యర్థి విజయరమణారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఊశన్నపల్లెలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తనపై వచ్చిన ఆరోపణలపై విజయరమణారావు వివరణ ఇచ్చారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జూలపల్లి: రైతులకు తక్కువ వడ్డీకే ఇస్తున్న వ్యవసాయ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు చొప్పదండి శాఖ మేనేజర్ శ్రీలత సూచించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 21 వరకు సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద సీఈవో సురేశ్ జెండావిష్కరణ చేశారు. అనంతరం కుమ్మరికుంటలో ఖాతాదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ చెప్పిన ఘర్‌ఘర్ కేసీసీ నినాదంతో భూమి ఉన్న ప్రతి ఖాతాదారుడు రుణాలను తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తక్కువ వడ్డీకే రుణాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అన్నిరకాల బ్యాంకుల కంటే డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సూపర్‌వైజర్ చంద్రారెడ్డి, ఎఫ్‌సీసీ అనిల్, కరుణాకర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు



జెండా ఆవిష్కరణలో సిబ్బంది

ఘనంగా సహకార వారోత్సవాలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వల, కనుకుల, గర్రెపల్లి, సుద్దాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం 70వ సహకార వారోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఆయా సంఘాల సీఈఓలు ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. సీఈఓలు రమేశ్, శంకరయ్య, వాయిద్, సతీశ్ అన్నారు.

కాల్వశ్రీరాంపూర్: వ్యవసాయ పరపతి సహకార సంఘం వారోత్సవాలు మండల కేంద్రంతోపాటు కూనారం సొసైటీల్లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా కార్యాలయాల్లో సీఈవోలు కోలేటి శ్రీనివాస్, విజేందర్ సహకార సంఘం జెండాలు ఆవిష్కరించారు.

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాకూర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

- రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఒక్క అవకాశం ఇస్తే రామగుండాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని వ్యాపారులను మంగళవారం ఆయన కలిసి చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్థానిక శాసనసభ్యుడు ఈప్రాంతాన్ని బొందల గడ్డగా చేశారని, ఇతర ప్రాంతాలకు వలసపోయే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. లక్ష్మీనగర్‌లో రోడ్లు సరిగా లేవని, కాంగ్రెస్ పోరాటంతో కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారని ఎద్దేవాచేశారు. రూ.11 కోట్లు వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినా వినియోగంలోకి తీసుకురాలేదని దుయ్యబట్టారు. 25ఏళ్లుగా ఇక్కడి సమస్యలపై పోరాటం చేస్తున్న తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

సాగునీరు అందిస్తా..

రామగుండం: అంతర్గాం మండలంలోని వ్యవసాయ పొలాలకు సాగు నీరు అందిస్తానని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. అంతర్గాం మండలంలోని వివిధ పార్టీలకు చెందిన గర్శిళ్ల శ్రీనివాస్, అలకుంట రమేశ్, ఆలకుంట సారయ్య, తిరుపతి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒల్లెపు స్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవుల గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఏం సాయం చేస్తరో చెప్తలేరు



మల్హర్: నాచారంలో మాట్లాడుతున్న పుట్ట మధు



రామగిరి: లొంకకేసారంలో పుట్ట శైలజ ప్రచారం

- బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మంథని/మల్హర్/మహదేవపూర్: ఓట్లకోసం ఆరు అబద్ధాల పథకాల గురించి చెబుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు.. మళ్లీ గెలిస్తే ఈప్రాంత ప్రజలకు ఏం చేస్తరో చెబుతలేరని బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు విమర్శించారు. మంథని నియోజకవర్గంలోని మల్హర్ మండలం అన్సాన్‌పల్లి, నాచారం, మల్లంపల్లి, రుద్రారం, సుభాష్‌నగర్, ఎడ్లపల్లి, కొండంపేట, ఇప్పలపల్లి, శాలపల్లి, వల్లెంకుంట, మహదేవ్‌పూర్ మండల కేంద్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చైర్‌పర్సన్ జక్కు శ్రీ హర్షిణి– రాకేశ్‌తో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, ఎన్నికల మేనిఫెస్టోతోపాటు తన సొంత మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. తాను ఇచ్చిన మాట తప్పలేదన్నారు. అబద్ధాలు నమ్మి మోసపోకుండా మీ బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ఈసందర్భంగా వివిధ మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. మంథని పవర్‌హౌస్ కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ఇంటింటా బొట్టు పెడుతూ ప్రచారం నిర్వహించారు.

మధుకరోకే మా మద్దతు

కాగా, పుట్ట మధుకు తమ మద్దతు ఉంటుందని తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి ధర్మేందర్, సలహాదారు బోనాల మల్లయ్య వెల్లడించారు. నాయకులు నక్క శంకరయ్య పెండ్లి నారాయణ పాల్గొన్నారు.

మధును ఆశీర్వదించండి

రామగిరి: పుట్ట మధును మనసారా ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కోరారు. లొంకకేసారంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ జాఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నాయకులు రొడ్డ శారద, ఇరుగురాల సదానందం, రాజమౌళి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి పరామర్శ

మధ్యప్రదేశ్‌కు ఎన్నికల విధులకు వెళ్తూ గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు శ్యాంకుమార్ కుటుంబాన్ని పుట్ట మధు పరామర్శించారు.

నిత్యావసరాలు అందజేత

ధర్మారం: మండలంలోని సాయంపేట గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు సీపెల్లి రామకృష్ణ వివాహానికి మంగళవారం అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, అధ్యక్షుడు కొత్త మోహన్, జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్, ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి మహేందర్, పీఆర్వో చంద్రమౌళి, బొల్లం మల్లేశం, సత్తయ్య, మోకనపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘అంకితభావంతో ఉన్నవారిని ఆగం చేసింద్రు’

పెద్దపల్లిరూరల్: బీజేపీ సిద్ధాంతం గల పార్టీ. అయితే ఈసారి ఎన్నికల్లో సిద్ధాంతాలను పక్కకు నెట్టిన అధిష్టానం స్వార్థంతో వచ్చే వలసనేతలకు ప్రాధాన్యం ఇచ్చి అంకిత భావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలను ఆగం చేసిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు గుజుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లిలో ఆయన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈటల రాజేందర్, వివేక్ వెంకటస్వామి నేతలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి సుదీర్ఘకాలంగా పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసేవారిని అవమానపర్చేలా పార్టీ పెద్దలు వ్యవహరించారంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తనను నమ్ముకుని ఉన్న పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటానని, పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు. నాయకులు అర్జున్‌రావు, శ్రీనివాసరెడ్డి, రాజు, చక్రధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సమ్మయ్య, తూడి రవి ఉన్నారు.



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పుస్తక పఠనం మేధాశక్తిని పెంచుతుంది



వారోత్సవాల్లో అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, పఠించడం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోందని, పుస్తక పఠనంపై శ్రద్ధ చూపడంలేదన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్యతో పాటు ప్రమోద్‌కుమార్, లైబ్రేరియన్ శ్రీనివాస్, అధ్యాపకులు సంజీవ్, నితిన్, రవీందర్‌రావు, రామకృష్ణ, అర్జున్, మనోజ్‌కుమార్, ఏవో భానువిజయానంద్, కిరణ్మయి ఉన్నారు.